క్లుప్తంగా

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో గురువారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠోవాలు ఈఓ వెంకటరమణ, బ్రహ్మశ్రీ భరత్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం జలధివాస కార్యక్రమం, శుక్రవారం విగ్రహాల గ్రామోత్సవం, శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారి వెల్దుర్తి శ్రీనివాసులు సహకారంతో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు. నందికొట్కూరు ఏడీ శ్రీనివాసులు, గ్రామస్తులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

రైతుభరోసా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి స్వాతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ పది కిలోల ధర రూ.880 ఉండగా సబ్సిడీతో రూ.440కి అందించనున్నారన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింకింగ్ మొబైల్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వెదుర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సైకిళ్లను చూపుతున్న అటవీశాఖ అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట సెక్షన్‌లోని బాలయ్యకుంట, మలుపుల చెరువు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో 16 సైకిళ్లపై తరలిస్తున్న వెదుర్లను స్వాధీనం చేసుకున్నట్లు బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా తెలిపారు. రూ. 40వేల విలువైన 500 వెదుర్లను స్వాధీనం చేసుకుని మహానంది మండలం గాజులపల్లె ఆర్ఎస్‌లోని అటవీడిపోకు తరలించామన్నారు. అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లడం, అటవీ సంపదను అక్రమంగా తరలించడం చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, సిబ్బంది పీవీ సుబ్బయ్య, రవీంద్రనాయక్, తేజ, మదార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల వాసికి డాక్టరేట్



బావికాడి రవిచంద్ర రావు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామవాసికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు వరించింది. మండలంలోని గ్రామానికి చెందిన బావికాడి రవిచంద్రరావు డోన్ మండలం కమలాపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన నల్లమల అటవీ ప్రాంతంలోని మొక్కలపై ఒక టీమ్‌గా ఏర్పడి పరిశోధన చేశారు. దీంతోపాటు ఆయన ఇకాలజీ ఫ్లోరిస్టిట్ డైవర్సిటీ ఆఫ్ నల్లమల ఫారెస్ట్ కర్నూలు డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని మార్చి 21న రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో సమర్పించారు. ఈ మేరకు రాయలసీమ విశ్వవిద్యాలయం వారు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డును గురువారం ప్రకటించారు.

ఉపాధి కూలీల మధ్య ఘర్షణ

మహానంది: ఉపాధి హామీ పనుల వద్ద ఫొటోలు అప్‌లోడ్ చేసే విషయంలో కూలీల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గోపవరం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలు స్థానిక చెరువు వద్ద గురువారం పనుల నిమిత్తం వెళ్లారు. మేటీలు శారద, తులశమ్మల గ్రూపుల వారు పనులు చేసేందుకు వెళ్లారు. మేటీ తులశమ్మ ఫొటోను అప్‌లోడ్ చేసి వెళ్తుండగా శారద గ్రూపునకు ఉపాధి కూలీలు త్వరగా వెళ్తున్నావంటూ ప్రశ్నించారు. దీంతో రెండు గ్రూపుల ఉపాధి కూలీల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. ఇదిలా ఉండగా ఉపాధి పనుల వద్ద పనులకు సంబంధించిన విషయంలో కూలీల మధ్య జరిగిన గొడవకు టీడీపీ నేతలు రాజకీయాలని ఆపాదించడం బాధాకరం. ఈ విషయంపై ఏపీఓ మనోహర్‌ను వివరణ కోరగా.. ఎన్ఎమ్ఎస్ యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేసే విషయంలో రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న మాట వాస్తమేనని చెప్పారు. ఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాలను సర్దిచెప్పి పనులను యథావిధిగా కొనసాగించామని వివరించారు.

వ్యక్తి మృతిపై 21న విచారణ

బొమ్మలసత్రం: నంద్యాల ఉప కారాగారంలో రిమాండ్ ముద్దాయిగా ఉన్న అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన కొండలరావు అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా గత ఏడాది నవంబర్ 13న కర్నూల్ సర్వజన ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన మృతిపై బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఎవరైనా అభ్యంతరాలు తెలియజేయదలుచుకుంటే ఆర్డీఓ కార్యాలయంలో నేరుగా సంప్రదించి, వాంగ్మూలం ఇవ్వాలని ఆర్డీఓ కోరారు.

జూపాడుబంగ్లాలో అత్యధిక ఓటింగ్

- 30,052 మందికి గాను 25,985 మంది ఓటుహక్కు వినియోగం
- 86.47శాతం పోలింగ్ నమోదు
- మహిళల ఓట్లే అధికం
- తరిగోపుల పంచాయతీలో స్త్రీ, పురుషులు సమానంగా ఓటింగ్



ఓటుహక్కు వినియోగించుకునేందుకు పారుమంచాల గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు

జూపాడుబంగ్లా: ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పోల్చితే జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలం వ్యాప్తంగా 12 గ్రామపంచాయతీల పరిధిలో 33 పోలింగ్ కేంద్రాలుండగా 30,052 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు–14,668 మంది, స్త్రీలు–15,383 మంది ఉన్నారు. కాగా, ఓటుహక్కును వినియోగించుకొనేందుకు పురుషుల కంటే అధికంగా మహిళలు పోటీపడ్డారు. దీంతో మండలం వ్యాప్తంగా 33 పోలింగ్ కేంద్రాల్లో 12,930 మంది పురుషులు, 13,055 మంది స్త్రీలు కలిపి మొత్తం 25,985 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోగా 86.47శాతం పోలింగ్ నమోదైంది. మండలం వ్యాప్తంగా పురుషుల కంటే స్త్రీలు 125 మంది అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. తరిగోపుల గ్రామపంచాయతీ పరిధిలో169, 170 పోలింగ్ బూత్‌ల పరిధిలో 2,431 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు–988, పురుషులు–988 మంది సమానంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. తరిగోపుల మజరా గ్రామం రామసముద్రంలోని 192 పోలింగ్ బూతులో 344 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు–155, పురుషులు–155 మంది సమానంగా ఓటుహక్కును వినియోగించుకోవటం గమనార్హం.

మండలంలో గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు..

పంచాయతీపేరు	మొత్తం ఓటర్లు	ఓటుహక్కు వినియోగించుకొన్న ఓటర్లు		
		పురుషులు	స్త్రీలు	మొత్తం
మండ్లెం	4,311	1,934	1,903	3,837
తర్తూరు	1,742	798	764	1,562
తంగడంచ	2,088	939	954	1,893
భాస్కరాపురం	1,030	458	500	958
తాటిపాడు	2,113	913	956	1,869
జూపాడుబంగ్లా	4,655	1,893	2,020	3,913
పారుమంచాల	4,113	1,736	1,665	3,401
కొత్తసిద్దేశ్వరం	258	100	112	212
పి.లింగాపురం	923	422	397	819
తరిగోపుల	2,431	988	988	1,976
రామసముద్రం	344	155	155	310
80బన్నూరు	2,200	950	960	1,910
పోతులపాడు	735	300	341	641
చాబోలు	213	94	92	186
తూడిచెర్ల	2,402	1,059	1,045	2,104
కనకయ్యకొట్టాల	494	191	203	394
మొత్తం	30,052	12,930	13,055	25,985

19 నుంచి ఆరాధనోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గ్రామంలో గడెపు ఎద్దుల పందెములు, గుర్రపు పందెములు, సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ పందెములు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గడెపు ఎద్దుల పందెములో విజేతల ఎద్ల యజమానులకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.7,500, రూ.5వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ట్రాక్టర్ రివర్స్ పందెములో విజేతలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ప్రవేశ రుసుం రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా గుర్రపు బండ్ల పందెములో విజేతలకు వరుసగా 25 తులాల వెండి, 20 తులాల వెండి, 15 తులాల వెండి, 10 తులాల వెండి, 5 తులాల వెండి బహుమతిగా అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

యర్రగుంట్లలో ప్రబలిన అతిసారం

- నంద్యాల ఆస్పత్రిలో 15 మంది బాధితులు
- గ్రామంలో మరో ఐదుగురికి అస్వస్థత



ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న శిల్పా భువనేశ్వర రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



అతిసారం బారిన పడిన వృద్ధురాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో అతిసారం ప్రబలింది. సుమారు ఇరవై మందికి పైగా అతిసారం బారిన పడటంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చేరారు. గ్రామానికి చెందిన లక్ష్మి, మనీషా, మద్దమ్మ, సుబ్బరాయుడు, హుసేనమ్మ, నాయుడుతో పాటు మరో 14 మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరూ నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో అతిసారం ప్రబలిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి నంద్యాల ఆసుపత్రికి చేరుకొని బాధితులకు పరామర్శించారు. అలాగే నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భావన, సిబ్బంది గ్రామానికి చేరుకొని ఇంటింటికి వెళ్లి పరిస్థితిపై ఆరా తీసి అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లో నీటి శుద్ధి విషయంలో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించామన్నారు. నీటి నమూనాలను సేకరించామని, పరీక్షలకు పంపిన తర్వాత పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వల్లే అతిసారం ప్రబలిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని బాధితుల బంధువులు విజ్ఞప్తి చేశారు.

గాలీవాన బీభత్సం

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర వనుములపాడు, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, పడమర ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లో సాయంత్రం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. పగిడ్యాల–కొణిదేల రహదారిలో చెట్ల కొమ్మలు అడ్డంగా విరిగిపడ్డాయి. దీంతో త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొలాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడం వలన దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి: మండలంలోని నాగంపల్లి, కొక్కెరం, కొత్తమాడుగుల, ఎదురుపాడు, జడ్డువారిపల్లె, శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులు, గాలితో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు ఎదురుపాడు గ్రామంలోని చర్చివద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది, ఎస్సీకాలనీలో విద్యుత్ స్తంభం విగిరి తీగలు తెగిపడ్డాయి. దీంతో కాలనీలో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది వెనువెంటనే మరమ్మతులు చేశారు.

కురిసిన వర్షం.. చల్లబడిన వాతావరణం

పాములపాడు: మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఉక్కబోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించినట్లైంది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. ఈ వర్షం పొలాల్లో వేసవి దుక్కులకు ఎంతో అనుకూలమని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా భారీ శబ్దాలతో కూడిన ఉరుములు, మెరుపులు ప్రజలను భయ కంపితుల్ని చేశాయి.



పాములపాడులో వర్షం కురుస్తున్న దృశ్యం



ఎదురుపాడు- జడ్డువారిపల్లె గ్రామాల రహదారిలో రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు



ఎదురుపాడు ఎస్సీకాలనీలో విద్యుత్ తీగలు తెగడంతో కిందపడేందుకు వాలిన విద్యుత్ స్తంభం



పగిడ్యాల వద్ద రోడ్డుపై విరిగిన చెట్టు

క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకా



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని వైద్యాధికారిణి దీపానాగవేణి అన్నారు. గురువారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. మండల కేంద్రమైన కొత్తపల్లితో పాటు గువ్వలకుంట్ల, నందికుంట, దుద్యాల, ఆరోగ్య ఉపకేంద్రాలలో బీసీజీ సర్వే అనంతరం అర్హులైన వారికి గురువారం నుంచి టీకా వేస్తారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని సూచించారు. టీబీ చికిత్స పూర్తి చేసుకున్నవారు, టీబీ వ్యాధి గ్రస్థులు, 60 సంవత్సరాలు పైబడిన వారు, 18 సంవత్సరాలు పైబడి షుగర్, ధూమపానం అలవాటు ఉన్న ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలకృష్ణ, పీహెచ్ఎన్ అయేషా బేగం, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది గుర్రప్ప, దేవకరణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్


ఆత్మకూరు: మండలంలోని నల్లకాలువ గ్రామంలో గురువారం 60 సంవత్సరాలు నిండిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు సీహెచ్‌ఓలు ఖుద్దూస్‌బాషా, శివకుమార్ తెలిపారు. టీబీ కాంటాక్స్‌కు, స్మోకింగ్ చేసిన వారికి, గుట్కా, కైనీ తీసుకున్న వారికి, బీఎంఐ తక్కువ ఉన్న వారికి ఈ టీకాలు వేయడం జరిగిందన్నారు. మొత్తం 52 మందికి టీకా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఏ చంద్రభాస్కర్, శారదమ్మ, ప్రమీలరాణి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు వ్యాక్సిన్

వెలుగోడు : క్షయ వ్యాధి నివారణకు ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ ను వెలుగోడు పట్టణంలోని ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు వేస్తున్నట్లు ఏఎన్ఎం దుర్గమ్మ తెలిపారు. గురువాతం 5 సచివాలయంలో 70 మందికి టీకా వేసినట్లు వెల్లడించారు. వైద్య సిబ్బంది గీత, ఆశా వర్కర్లు తులసి,అంకమ్మ , సురేఖ , స్వర్ణలత పాల్గొన్నారు.

రాత్రంతా అడవిలోనే

- బర్రెలు కాసేందుకు వెళ్లి నల్లమలలో తప్పిపోయిన యువకుడు
- మరుసటి రోజు కృష్ణాపురంలో తేలిన వైనం
- క్షేమంగా ఉన్నట్లు పోలీసులకు ఫోన్



తరుణ్

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన 22 ఏళ్ల అరుణ్ బుధవారం ఉదయం గ్రామశివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో బర్రెలు కాసేందుకు వెళ్లాడు. అయితే ఉదయం వెళ్లిన తరుణ్ అర్ధరాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఆత్మకూరు పోలీసులకు గురువారం ఉదయం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తక్షణమే రంగంలోకి దిగిన ఆత్మకూరు పోలీసులు డ్రోన్ కెమెరాల ఆధారంగా నల్లమల అడవి ప్రాంతం మొత్తం 8 గంటలపాటు వెతికారు. అయినప్పటికీ అదృశ్యమైన తరుణ్ ఆచూకీ లభించలేదు. చివరికి గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామంలో తరుణ్ ప్రత్యక్షం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాను క్షేమంగా ఉన్నట్లు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. నల్లమల అటవీ ప్రాంతంలోకి బర్రెలు కాసేందుకు వెళ్లిదట్టమైన అటవీ ప్రాంతం కావడంతో తప్పిపోయి రాత్రంతా కొండపైనే ఉండిపోయినట్లు వెల్లడించారు. చివరికి ప్రాణాలతో కృష్ణాపురం గ్రామానికి చేరుకున్నట్లు తెలిపాడు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో సాధారణ, శీఘ్రదర్శనం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ప్రసాదాల కోసం గంటల తరబడి నిరీక్షించి ప్రసాదాలను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులరద్దీ కొనసాగింది.



మహానందీశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఒక్కరుంటే ఒట్టు!



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి మూడు రోజులైనా తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఒక్కరంటే ఒక్కరు కూడా విధులకు హాజరుకాకపోవడంతో కార్యాలయం వెలవెలబోతుంది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఇద్దరు డీటీలు, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంటు, మండల సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు. ఎన్నికలు ముగిసినా వారిలో ఒక్కరు కూడా గురువారం వరకు విధులకు హాజరుకాకపోవటం గమనార్హం. దీనికితోడు పలురకాల పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి వస్తున్న రైతులు, ప్రజలు కార్యాలయంలో అధికారులేకపోవడంతో ఊసురుమంటూ వెనుదిరగాల్సి వస్తోంది.

మహానందీశ్వరస్వామి ఆభరణాల పరిశీలన

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసి ప్రస్తుతం కాళహస్తి ఏసీ మల్లికార్జున ప్రసాద్ గురువారం మహానంది దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బందితో సమావేశమయ్యారు. స్వామి వారికి చెందిన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువుల వివరాలను పరిశీలించారు. వివిధ బ్యాంకుల లాకర్లలో నిల్వ ఉంచిన వాటితో పాటు స్వామి, అమ్మవార్లకు అలంకరించిన, భక్తులు సమర్పించిన వస్తువుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తిస్థాయిలో రికార్డుల్లో పొందుపరిచారు.

21నుంచి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ, ఏడీ వెంకటరమణ గురువారం తెలిపారు. 21న 5.20 గంటలకు స్వామి, అమ్మ వార్ల కల్యాణ మహోత్సవం ఉదయం 8 గంటలకు శేషవాహనం, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమం, 22న వైశాఖ శుద్ధ చతుర్దశి ఉదయం 8 గంటలకు సింహవాహనం, రాత్రి 7.30 గంటలకు గరుడోత్సవం, 23న ఉదయం రథాంగ హోమం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గటంలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల రథోత్సవం, 24న ఉదయం తీర్థావళి, పుర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు పారువేట మహోత్సవం, నిర్వహిస్తున్నట్లు ఈఓ వెల్లడించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనుమతులున్న విత్తనాలనే విక్రయించాలి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. విత్తనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకపోతే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం పట్టణంలోని సాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రీవెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో ఏఓ ప్రసాదరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బుక్‌బిల్స్ తనిఖీ చేసి విత్తన నాణ్యతను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల నుంచి పది విత్తన నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా హెచ్‌టీ టెస్టులో నెగిటివ్‌గా నిర్ధారణ వచ్చిందన్నారు. విత్తనాలను విక్రయించే డీలర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పగిడ్యాల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పిల్లల చేత పుస్తక పఠనం చేయించారు. అన్ని రకాల పుస్తకాలు కలిగిన గ్రంథాలయాల సేవలను విద్యావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దినపత్రికలు, వారప్రతికలు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, చందమామ కథలు, నవలలు తదితర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బాల్యం నుంచే పుస్తకం పఠనం చేయడం అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం పిల్లల చేత ఆటపాటలు నేర్పించారు.



పిల్లలతో పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో ఈ నెల 14న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శివ సేవా యూత్ సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సేవా సమితి యూత్‌సభ్యులు జగదీష్, ఉపేంద్ర, హర్షవర్దన్, సాయి మాట్లాడుతూ గ్రామంలో నాగశేషులు అనే వ్యక్తికి చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కట్టు బట్టలు మినహా ఏమి మిగల్లేదన్నారు. తమ వంతుగా ఆ కుటుంబానికి రూ.19వేలు నగదు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. అలాగే గ్రామానికి చెందిన చెల్లె వెంకటరెడ్డి 50 కేజీల బియ్యం ఇచ్చారని చెప్పారు. మానవతా దృక్పథంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న శివ సేవా సమితి సభ్యులు

వరికి ముందు పచ్చిరొట్ట సాగు చేయాలి



జీలుగ పైరు(ఫైల్)

వెలుగోడు: వరికి ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకోవాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. 50 శాతం సబ్సిడీతో జీలుగు విత్తనాలు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గురువారం స్థానిక ఆర్బీకేలో రైతులకు పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏఓ మాట్లాడుతూ..ఆశించిన ఫల సాయం సాధించాలంటే భూసారాన్ని కాపాడుకోవాలి, పూర్తిగా రసాయనిక ఎరువులపై ఆధారపడితే నేల సారం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ ఎరువు వాడకంతో నేలకు సత్తువ లభించడమే కాకుండా రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభమైందన్నారు. రైతులందరూ పట్టాదారు పాసుబుక్కులు, ఆధార్ కార్డు తీసుకెళ్లి జీలుగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వెలుగోడు మండలానికి 180 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించారని చెప్పారు. క్వింటా ధర రూ.8,800 గాను 50 శాతం రాయితీతో రూ.4,400. అలాగే 10 కేజీల జీలుగలు ధర రూ.880 సబ్సిడీ రూ.440 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీలుగ వేయడం ద్వారా భూమిలో పేరుకుపోయిన చౌడును తగ్గించవచ్చు అన్నారు. ఎకరాకు 12 కిలోల విత్తనం వెదజల్లుకోవాలని సూచించారు.